క్లుప్తంగా

81 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు సిటీ: నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌లో వేసవి కాలంలో రక్త నిల్వలు తగ్గిపోవడంతో ఆస్పత్రి వారి విజ్ఞప్తి మేరకు కాలేజీలో ఏర్పాటు చేసిన శిబిరంలో 81 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను కాలేజీ ప్రిన్సిపాల్‌తో పాటు, పెద్దాసుపత్రి వైద్యులు అభినందించారు.

మైనార్టీలకు నీట్, ఈఏపీసెట్ ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: మైనార్టీ అభ్యర్థులకు నీట్, ఏపీ ఈఏపీసెట్ పరీక్షలకు ఉస్మానియా కాలేజీలోని రీజినల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (ఆర్‌సీఈడీఎం) వారి ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉండి ఇంటర్మీడియెట్ సెకండ్ ఇయర్ హాల్ టికెట్‌తో పాటు, నీట్, ఏపీ ఈఏపీ సెట్‌కు ఆన్‌లైన్‌లో చేసుకున్న కాపీతో పాటు, ఆధార్ కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేసి ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీలోపు ఉస్మానియా కాలేజీలోని రూం నెంబరు 54లో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 94417 61178, 98498 96996 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కృష్ణగిరి ఎస్‌ఐ చంద్రశేఖర రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఎన్నికల కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు చేశాడు. ఇటీవల మండలంలోని చుంచుఎర్రగుడికి చెందిన నరసింహులుపై అక్రమ కేసు పెట్టి వేధిస్తున్నారని పేర్కొన్నారు.

24న పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత బండి నారాయణ స్వామి రచించిన 'మన సీమ కథలు' పుస్తకావిష్కరణ ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సయ్యద్ జహీర్ అహ్మద్, పెరికల రంగ స్వామి తెలిపారు. గాయకులు, రచయిత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, రచయిత కలం ప్రహ్లాద, కానాపురం కృష్ణారెడ్డి అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సాహితీ ప్రియులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

24న 'అవ్వ అప్పచ్చి' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే సాంఘిక నాటక ప్రదర్శనల్లో భాగంగా ఈ నెల 24న సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. ఈనెల 25న సాయంత్రం 7 గంటలకు హైదరాబాద్ శ్రీ మురళీ నిలయం వారి 'అవ్వ అప్పచ్చి' నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కళాభిమానులు పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లను గురువారం 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పరిశీలించారు. అక్కడి ఈవీఎం ర్యాక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలను భద్రపరిచేందుకు స్థలాలను పరిశీలించినట్లు చెప్పారు. అనుకూలంగా ఉన్న స్టేడియంలో వీటిని భద్రపరచనున్నట్లు చెప్పారు. అలాగే ఈవీఎంల భద్రతకు అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్, డీఈఈ గిరిరాజు, ఎఈ ప్రవీణ్‌లను ఆదేశించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

కర్నూలు (టౌన్): సార్వత్రిక ఎన్నికల ప్రకటన వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియామావళి అమలులో ఉందని 137 కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు. అందులో భాగంగానే నగరంలోని వివిధ ప్రాంతాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు, స్టిక్కర్లు తొలగించినట్లు చెప్పారు. అలాగే ఆటోలపై పార్టీల జెండా గుర్తులు ఉన్న వాటిని తొలగించామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియామావళి అమలులో ఉన్నందున పోస్టర్లు, బ్యానర్లు నిషేధమన్నారు. తొలగించడానికి వీలులేని వాటికి పూర్తిగా నల్లరంగు పూసినట్లు చెప్పారు. తనిఖీల్లో నోడల్ ఆధికారి రంగస్వామి పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు భరోసా

- రూ.60 లక్షలతో ముఖ్య కూడళ్లలో స్ట్రీట్ మార్కెట్లు
- తీరిన చిరువ్యాపారుల కష్టాలు
- తొలగిన ట్రాఫిక్ ఇబ్బందులు



వినాయక ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రీట్ మార్కెట్



పండ్లను కొనుగోలు చేస్తున్న ప్రజలు

కర్నూలు (న్యూటౌన్): ఒకప్పుడు నెత్తిమీద గంప పెట్టుకుని ఎండనక, వాననక ఇంటింటికీ తిరిగేవారు. ఎక్కడపడితే అక్కడ వ్యాపారాలు చేసుకోవడం వల్ల వ్యాపారులకు, కొనుగోలుదారులకు ఇబ్బందులు ఏర్పడేవి. అలాగే ఈ వ్యాపారాల వల్ల ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తేది. గత ప్రభుత్వంలో రోడ్ సైడ్ వ్యాపారులు, వీధి వ్యాపారులు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వీరికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం అలాగే మహిళలకు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు అమలు చేయడంతో వారి కష్టాలు తీరిపోయాయి. చిరువ్యాపారులు ఎక్కడెక్కడ నుండో వచ్చి పట్టణాల్లో వ్యాపారాలు చేసుకోవడం వల్ల అనేక ఇబ్బందులు వచ్చేవి.దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వీరికి గుర్తింపుకార్డులు మంజూరు చేసింది. గుర్తింపు కార్డులున్న వీధి వ్యాపారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా వడ్డీ లేని రుణాలు రూ.10 వేలు మంజూరు చేస్తోంది. దీన్ని నిర్ణీత సమయంలో చెల్లించిన వారికి రూ.50 వేల రుణం మంజూరు చేస్తోంది. దీని వల్ల వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా ప్రభుత్వం వీరికి అండగా నిలుస్తోంది. ముఖ్య కూడళ్లలో స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేందుకు నగరంలో మొట్టమొదటిసారిగా స్ట్రీట్ మార్కెట్స్ వెలిశాయి. ఒకే చోట వ్యాపారం చేసుకునే అవకాశంతో పాటు వారికి సౌకర్యాలు ప్రభుత్వం కల్పించింది. స్మార్ట్ సిటీలో భాగంగా తప్పనిసరి స్ట్రీట్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ యంత్రాంగం అమలు చేసింది. తద్వారా కొనుగోలుదారులకు వ్యాపారులకు ఇబ్బందులు తొలగాయి.

ఎక్కడెక్కడంటే...

కర్నూలు నగరంలో కేసీ కెనాల్ వినాయక ఘాట్, వాల్‌మార్ట్ ఎదురుగా, కృష్ణానగర్ ఐటీసీ సర్కిల్ సమీపంలో రూ.60 లక్షల వ్యయంతో కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు స్ట్రీట్ మార్కెట్‌లను ఏర్పాటు చేశారు. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి వారి వ్యాపారానికి చేయూతనందించారు.

మా కష్టాన్ని ప్రభుత్వం గుర్తించింది



ఒకప్పుడు ఎండనక, వాననక రోడ్లపై తోపుడు బండ్లలో పండ్లు పెట్టుకుని వ్యాపారం చేసేవాళ్లం. ప్రస్తుతం మా కష్టాలను ప్రభుత్వం గుర్తించి వీధి వ్యాపారులకు షెడ్లు ఏర్పాటు చేసింది. చల్లటి నీడలో వ్యాపారం చేసుకునేందుకు మంచి అవకాశం కల్పించింది. మాలాంటోళ్ల సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– వడ్డె సావిత్రమ్మ, వీధి వ్యాపారి

నీడ పట్టున వ్యాపారం



గత 30 ఏళ్లుగా పండ్ల వ్యాపారం చేస్తున్నా. గతంలో ఏ ప్రభుత్వం వీధి వ్యాపారుల కష్టాలను గుర్తించలేదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా కష్టాలను గుర్తించి పండ్ల వ్యాపారానికి ఒక వేదికను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. గతంలో రోడ్లపై తోపుడుబండ్లను పెట్టుకుని వ్యాపారం చేసుకుంటుంటే ట్రాఫిక్ సమస్య అనేవారు.ప్రస్తుతం ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా నిలువ నీడలో పండ్ల వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వం చేయూతనివ్వడం శుభపరిణామం.

– లక్ష్మీదేవి, వీధి వ్యాపారి

ఒకేచోట అన్ని రకాల పండ్లు లభ్యం



కర్నూలు నగరంలో కొత్తగా నగర పాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేసిన స్ట్రీట్ మార్కెట్ల వద్ద అన్ని రకాల పండ్లు ఒకే చోట కొనుగోలు చేసే అవకాశం కల్పించడం చాలా బాగుంది. గతంలో రోడ్లపై తోపుడుబండ్లలో పండ్లను కొనుగోలు చేసేవాళ్లం. ప్రస్తుతం స్ట్రీట్ మార్కెట్‌లలో అన్ని రకాల పండ్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు వీధివ్యాపారులు నీడలో వ్యాపారం చేసుకునే అద్భుత అవకాశం కల్పించడం మంచి పరిణామం.

– మాసుంబాషా, లెక్చరర్, కర్నూలు

స్మార్ట్ సిటీలో భాగంగానే ఏర్పాటు



స్మార్ట్ సిటీ రూపకల్పనలో భాగంగా నగరంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. వీధి వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ వ్యాపారం చేసుకోవడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ముఖ్య కూడళ్లలో ప్రతిరోజూ ఇదే సమస్య.దీన్ని పరిష్కరించేందుకు వ్యాపారులందరూ ఒకేచోట వ్యాపారం చేసుకునే విధంగా సౌకర్యాలు కల్పించాం. ఇప్పటికే వినాయక ఘాట్, వాల్‌మార్ట్, కృష్ణానగర్ ఐటీసీ ప్రాంతాల్లో స్ట్రీట్ మార్కెట్‌లను ఏర్పాటు చేశాం. త్వరలోనే కొత్తబస్టాండు,ఉ ల్యాల రోడ్డు ప్రాంతాల్లో స్ట్రీట్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– షాకీర్ హుస్సేన్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

కల్లూరు ఓటర్లు @ 3.25 లక్షలు

- జిల్లాలో ఇక్కడినుంచే అత్యధికంగా ఓటరు నమోదు దరఖాస్తులు
- ఏటికేడు పెరుగుతున్న సంఖ్య

పాణ్యం: ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధికంగా ఓటర్లు కలిగిన నియోజకవర్గం పాణ్యం. ఇక్కడ ఏటేటా ఓటర్లు పెరుగుతూనే ఉన్నారు. 2019తో పోల్చితే ఈసారి ఏకంగా 37544 మంది ఓటర్లు పెరిగారు. 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి పాణ్యం నియోజకవర్గంలో 2,88,031 మంది ఓటర్లు, 286 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటికివరకు 3,25,575 మంది ఓటర్లు నమోదవగా 350కి పైగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఓటర్లలో చైతన్యం రావడం, ఎన్నికల సంఘం పదేపదే అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో 18 ఏళ్లు నిండిన యువతీయువకులందరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం కల్లూరు మండలం నుంచి దరఖాస్తులు అత్యధికంగా వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల వరకు ఎన్నికల కమిషన్ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. వచ్చిన ప్రతి దరఖాస్తును ఆయా బీఎల్‌ఓలకు పంపించి క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక పంపతున్నా, ఎలాంటి ఒడిదుడుకులకు తావులేకుండా ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందిస్తున్నారు.

30న వేద విద్యానిలయం భూమిపూజ

కర్నూలు కల్చరల్: అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యన్నదాన సత్రం, మేమూరి వారి తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు వీఆర్ కాలనీలోని సాయిబాబా దేవాలయం సమీపంలో ఆచార్య మేడూరి దీక్షితుల వెంకట సుబ్బయ్య, స్మారక వేద విద్యానిలయం భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉడిపి పలిమారు మఠాధీశులు 1008 శ్రీ విద్యాధీశ తీర్థ స్వామీజీ, ఉత్తరాధికారి 1008 శ్రీ విద్యా రాజేశ్వర తీర్థ స్వామీజీ చేతుల మీదుగా భూమిపూజ జరుగుతుందని పేర్కొన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ సాయి గోపాల్ అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం



పాత కల్లూరులో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

- చంద్రబాబు హామీలను నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. ఆయన గురువారం కల్లూరు అర్బన్ 37, 33వ వార్డులలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను కళ్లారా చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదల అభ్యున్నతి కోసం నవరత్నాల పథకాలు అమలుచేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల పేదల జీవన ప్రమాణాలు మెరుపడ్డాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందిస్తున్న పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలతో పాటు చెప్పని వాటిని కూడా అమలు చేశామన్నారు. కరోనా మహమ్మరి ప్రభావంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్నా పేదల బాగుకోసం సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు.

చంద్రబాబును నమ్మితే అధోగతే: ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి మళ్లీ మోసగించేందుకు టీడీపీ నేతలు ప్రజల ముందుకు వస్తున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని ఎమ్మెల్యే కాటసాని సూచించారు. 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక నెరవేర్చకుండా ప్రజలను నిండా ముంచారని గుర్తు చేశారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్పొరేటర్లు, ఆయా వార్డుల్లోని నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలిచిన వైఎస్సార్‌సీపీని గెలిపిద్దాం



పాతబస్తీలో ప్రచారం చేస్తున్న అభ్యర్థి ఇంతియాజ్, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే తదితరులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గురువారం ఉదయాన్నే ఆయన పార్టీ నాయకులతో కలిసి స్టేడియంలో కలియతిరిగారు. స్టేడియానికి వచ్చిన వాకర్స్‌ను పరిచయం చేసుకున్నారు. డాక్టర్లు, న్యాయవాదులు, రిటైర్డు ఉద్యోగులతో కలిసి నడిచారు. వ్యాయామశాలలో కసరత్తు చేస్తున్న వారిని, వాలీబాల్ క్రీడాకారులను ఆప్యాయంగా పలకరించారు. బయట రోడ్డు సైడ్ వ్యాపారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారి పక్షాన నిలబడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపిద్దామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన విధానాలు నచ్చి కలెక్టర్ హోదాలో పనిచేసిన తాను పదవికి రాజీనామా చేసి, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. తనకున్న 30 సంవత్సరాల పరిపాలన అనుభవంతో ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాకుండా నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ఈ ఐదేళ్లలో కర్నూలు నగరం ఎంతో వృద్ధి సాధించిందని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో పాటు నిర్దిష్టమైన ప్రణాళికతో అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. సచివాలయాల జిల్లా కో–ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి, పార్టీ నాయకులు తిరుమలేశ్వర రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసేందుకు అవకాశం కల్పించండి

కర్నూలు (టౌన్): ప్రజా సేవ చేసేందుకు అవకాశం కల్పించాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ అభ్యర్థించారు. ఆయన గురువారం రాత్రి స్థానిక 8వ వార్డు పరిధిలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. రాబోయే రోజుల్లో పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. విద్యావంతుడు, మచ్చలేని అధికారిగా పేరు తెచ్చుకున్న ఇంతియాజ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుందామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు ప్రాంతం వైఎస్సార్‌సీపీకి కంచుకోట లాంటిందని, మరోసారి పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుక ఇద్దామని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న అభ్యర్థి ఇంతియాజ్, నాయకులు

– స్థానిక పాతబస్తీ పెద్దపడఖానలోని మోతీయ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో అభ్యర్థి ఇంతియాజ్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి దువా చేశారు. సీనియర్ నాయకులు గడ్డం రామకృష్ణ, అబ్రార్, ఫరూక్, షాకీర్, శివ, బాసిత్, ఫైరోజ్, షబ్బీర్ పాల్గొన్నారు.

నటనపై శిక్షణ

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఫిలిం, టీవీ, థియేటర్ రంగంలో ఆసక్తి గల యువతకు నటనలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, శిక్షణ నిర్వాహకులు జల్లు కుమార్ తెలిపారు. ఆసక్తిగల యువతీ యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి మే 30వ తేదీ వరకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శిక్షణ ఉంటుందని, 15 నుంచి 25 ఏళ్ల వయసు కలిగి తెలుగులో చక్కగా మాట్లాడగలిగిన వారై ఉండాలని సూచించారు. శిక్షణ పొందిన విద్యార్థులచే ఒక సాంఘిక నాటకం ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు జల్లు కుమార్ 93913 36005 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పెద్దాసుపత్రిలో రద్దీ నియంత్రణకు చర్యలు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కొన్ని విభాగాల్లో రోగుల రద్దీని నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ మేరకు రెండు రోజుల క్రితం రాష్ట్రంలోని బోధనాసుపత్రుల అధికారులతో డీఎంఈ సూచనలు, సలహాలు తీసుకున్నారు. ముఖ్యంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్ తదితర విభాగాల్లో రోగుల రద్దీ అధికంగా ఉంటోంది. కొన్నిసార్లు మధ్యాహ్నం 1 గంట వరకు సైతం ఓపీ చూడాల్సి వస్తోంది. దీనివల్ల వైద్యులకు పని భారంతో పాటు రోగులకు సమయం మీరిపోతోంది. ఈ సమస్యలను గుర్తించిన ప్రభుత్వం చర్యలకు సిద్ధమైంది. రద్దీ ఉన్న విభాగాల్లో ఓపీ నిర్వహించే రోజున ప్రస్తుతం ఒక యూనిట్ వైద్యులు మాత్రమే ఓపీ రోగులకు చికిత్స అందిస్తున్నారు. అలాగాకుండా రెండు యూనిట్ల వైద్యులు ఒకే రోజు ఓపీ చికిత్స అందిస్తే రద్దీ తగ్గుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీనివల్ల వైద్యులకు పనిభారం తగ్గడంతో పాటు రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందే అవకాశముందని వారు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు అధికారులు, వైద్యుల సలహాలు, సూచనలను రాష్ట్ర ఉన్నతాధికారులు తీసుకున్నారు. ఈ నూతన విధానాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత



అటవీ దినోత్సవంలో అధికారులు, విద్యార్థులు

కర్నూలు కల్చరల్: అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ కర్నూలు రేంజర్ పి.వి.రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు మండల పరిధిలోని మిలటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఓ మాట్లాడుతూ.. అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో అందరూ పాలు పంచుకోవాలన్నారు. మారుతున్న జీవన శైలికి అనుగుణంగా దైనందిన జీవనంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. నీటిని, ఇంధన వనరులు, ఆహార పదార్థాలను పొదుపుగా వాడుకోవాలన్నారు. పచ్చదనాన్ని విస్తరింపజేసేందుకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించేలా విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. అడవులు, వన్యప్రాణులు వాటి ప్రభావం మానవాళి మనుగడకు ఏ విధంగా దోహదపడతాయనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. డిప్యూటీ రేంజర్ లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు: నియోజకవర్గంలోని ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పాణ్యం నియోజకవర్గ ఆర్వో/ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సూచించారు. గురువారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లోని 14, 15వ పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం స్వీప్ కార్యక్రమంలో భాగంగా కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కల్లూరు ఎంఈఓ ఆఫీస్ వరకు నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలనలో 14, 15 కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్లు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, సార్వత్రిక ఎన్నికల్లో తమకు నచ్చిన వారికి నిర్భయంగా ఓటు వేయవచ్చన్నారు. నియోజకవర్గంలోని ఓటర్లకు ఓటు హక్కు స్వేచ్ఛపై (స్వీప్) సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం ర్యాలీ నిర్వహించామన్నారు. యువత ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి, ఓటును సద్వినియోగం చేసుకునేలా చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ మునివేలు, ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి, బూత్ స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌తో ఆరోగ్య సమస్యలు



డౌన్ సిండ్రోమ్ బాధిత చిన్నారులతో వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్): డౌన్ సిండ్రోమ్ పిల్లలు ఎదుగుతున్న కొద్దీ రకరకాల సమస్యలు మొదలవుతాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. డౌన్ సిండ్రోమ్ పిల్లల్లో ముఖం భిన్నంగా కనిపిస్తుందని, తల వెనుక భాగం సమతలంగా ఉంటుందని, ముక్కు ఎముక ఎదగకపోవడం వల్ల ముక్కు దూలం కుంగిపోతుందని చెప్పారు. రెండు కళ్ల మధ్య దూరం, కంటి రెప్ప మడత ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కళ్లు తిరిగిపోయినట్లు బాదం ఆకారంలో కనిపిస్తుంటాయని, నోరు చిన్నగా ఉండటం వల్ల నాలుక బయటకు చాస్తుంటారన్నారు. అరచేతిలో అడ్డంగా ఒకే గీత ఉంటుందని, చేతులు, పాదాలు పొట్టిగా, పాదం బొటన వేలు పక్కవేలుకు దూరంగా ఉంటాయన్నారు. కండరాల పటుత్వం లేకపోవడం వల్ల కదలికలు నెమ్మదిస్తాయన్నారు. మిగతా పిల్లలతో పోలిస్తే వీరిలో బుద్ధి కుశలత తక్కువగా ఉంటుందని వివరించారు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానంద బాబు మాట్లాడుతూ.. ఈ వ్యాధితో బాధపడే పిల్లల్లో భౌతిక ఎదుగుదల లేకపోవడం, బుద్ధిమాంద్యం చురుకుదనం లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. గర్భిణి దశలోనే వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకుంటే జన్యుపరమైన సమస్యలు నివారించవచ్చని చెప్పారు. గర్భస్థ శిశువు జన్యులోపాలను ముందుగానే న్యూకల్ ట్రాన్స్లుయెన్సీ (ఎన్‌టీ స్కాన్) పరీక్షల ద్వారా గుర్తించవచ్చన్నారు. ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డాక్టర్ శైలేష్‌కుమార్, ఐఏపీ కార్యదర్శి డాక్టర్ రత్నాకర్ రెడ్డి, డైస్ డాక్టర్ సృజన, మేనేజర్ ఇర్ఫాన్, హెచ్‌ఈ పద్మావతి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

జిల్లా వాసికి అరుదైన గౌరవం



పురస్కారం అందుకుంటున్న పోలూరు పావని

కర్నూలు సిటీ: అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకోని మ గ్లోబల్ ఫౌండేషన్ వారు సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పోలూరి పావనికి ఆంగ్ల భాష నందు జాతీయ స్థాయిలో రాణి రుద్రమదేవి ఉత్తమ సేవా పురస్కార్-2024 అందజేశారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో ఆంగ్ల రచయిత్రిగా వేర్వేరు కవితలు రాసి అనేక పురస్కారాలు అందుకోవడం జరిగిందన్నారు. ఈ పురస్కారాలన్నింటినీ పరిశీలించిన మక్ష్‌ఫౌండేషన్ వారు ఇంగ్లిష్ లిటరేచర్‌లో ఈ నెల 19న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందజేసినట్లు పేర్కొన్నారు.

– బీ క్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఎస్.నాగస్వామి నాయక్ విద్యారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకుగాను మక్షఫౌండేషన్ వారు ఛత్రపతి శివాజీ మహారాజ్ ఉత్తమ పురస్కార్‌ను ప్రదానం చేశారు.